# ప్రవాహం

## శ్రీ. శ్రీ.

కాబట్టి శ్రీ శ్రీ కి స్థిరం లేదంటున్న వాళ్ళందరికీ నాకృతజ్ఞత. జీవించడం అంటే ప్రవహించడం కాబట్టి. నేను జీవిస్తున్నానన్న నిజాన్ని వాళ్లు గుర్తిస్తున్నారు కాబట్టి.

నిన్నగాక మొన్నదాకా వృక్షాల నిశ్చలత్వాన్ని మెచ్చుకుంటున్న నేను నేడు ప్రవాహం గురించి ప్రశంసించడం కొందరికి ఆశ్చర్యం కలిగించవచ్చు. అదే మరి స్థిరంలేకపోవడం అనవచ్చు. స్వవచనవ్యాఘాతం అనే దోషాన్ని నా మీద ఆరోపించవచ్చు. కాని చెట్లలోని నిశ్చలత్వాన్ని నేను ఆరాధించడం మానలేదే! నాకూ ఒకచోట స్థిరంగా ఉండాలనే ఉందే! ఏదీ నేను కోరుకునే నిశ్చలత్వం?

బహుశా నాలో స్థిరత్వం లేకపోవడానికి అన్నిటికీ నేను 'ఔను' అనడమే కారణం కాబోలు? పన్నెండోఏటికే పన్నెండు భాషలలో ప్రజ్ఞ సంపాదించిన జెసీ అనే అమ్మాయి ఒక్క భాషలో కూడా 'వద్దు' అనలేకపోయిందట. అడగనివాడిదే పాపంగా బదికి ఉండాలి పాపం జెస్సీ!

ఎన్నో సార్లనుకుంటాను 'వద్దు' అనాలని. ఒకమారు నేను 'నాకీ జీవితం వద్దు' అనేసి ఆ నిశ్చయాన్ని ఆచరణలో పెట్టబోయాను. కాని మనకి స్థిరంలేదుగా? మనస్సు మార్చుకున్నాను. ఇక మీద మృత్యువు దానంతట అదే రావాలి. అప్పుడు కూడా వద్దనడం నాకు చేతకాదు.

షరతులులేని ఒకే ఒక్క సరే నా జీవితం. ఇందులో కొన్ని ఇబ్బందులూ ఉన్నాయి; కొన్ని సదుపాయాలూ ఉన్నాయి. 'సరే' అనడం అంత కష్టమైనదీకాదు; అలాగని సులభమైనదీ కాదు.

సరే. ఒప్పుకున్నాం—ప్రవాహం ఎటు తీసుకుపోతే అటు పోవడానికి. దేన్నీ నిరోధించకూడదు. దేన్నీ నిరాకరించకూడదు: అయితే ఏమయినట్టు?

కాకపోతే ఏమయినట్టు? ఒక ప్రశ్నకి జవాబుగా ఇంకో ప్రశ్న వెయ్యడం మంచిది. చాలా మంచి ప్రశ్నకు జవాబు జవాబులంటారు. ప్రశ్నకు జవాబు ప్రశ్ననిచేస్తే ప్రశ్నించినవాడిమీదనే జవాబిచ్చే బాధ్యత కూడా పడుతుంది.

ప్రస్తుతం ప్రశ్నించినవాడిని నేనుకాబట్టి జవాబు కూడా నేనే ఇస్తాను.

ఏమయినట్టు? ప్రవహించడం మానేస్తాను. గడ్డ కట్టుకుపోవడానికి అనుమతిస్తాను. సమయానుకూలంగా సరే అని తాళంవెయ్యడమో, వీల్లేదని గద్దించడమో చేస్తాను. ఏపనులుచేస్తే మన ప్రతిష్ఠ ఇనుమడిస్తుందో అవే చేస్తాను. ఎవరితో కూడితే మనకి లాభించే తలుపులు తెరుచుకుంటాయో వాళ్లతోనే తిరుగుతాను. వాళ్ళ శత్రువులు నా శత్రువులే అని భ్రమపడడం కూడా ప్రారంభిస్తాను. ఎవడేనా నాదగ్గరకి వస్తే, వీడు ఎందుకు వచ్చాడు? వీడిని ఏమాత్రం వాడుకోవచ్చు? అనే పద్ధతుల మీద ఆలోచిస్తాను. సాలెపురుగులాగ గూడు కట్టుకొని ఏమక్షికమైనా పడదా అని ఎదురు చూస్తూ ఉంటాను.

ఇన్నిచేసినా జీవించడం ప్రవహించడంమానదు. నేను ప్రవహిస్తున్నానన్న నిజాన్ని గుర్తిస్తున్న వాళ్ళకి నా కృతజ్ఞత.


**ది ఇండియన్ బ్యాంక్ లిమిటెడ్**

హెడ్డాఫీసు : మదరాసు

(Estd:  1907)

జారీచేసి చందావేయబడిన

| | |
|---|---|
| మూలధనం | రూ. 72,00,000 |
| అడిగిన మూలధనము. | రూ. 53,00,000 |
| రిజర్వ్ ఫండ్ | రూ. 62,00,000 |

అన్నిరకాల బ్యాంకింగ్ వ్యవహారాలు చేయబడును.

యన్. గోపాల అయ్యర్,
కార్యదర్శి.